# టిట్ ఫర్ టాట్

-సి. జయపాల్‌రెడ్డి

''మంజరీ! నీతో మాట్లాడాలి'' కాలేజీకి వెళుతున్న మంజరికి ఎదురుపడి అన్నాడు కిషన్.

''ఏం మాట్లాడాలి?'' నడుస్తూనే అంది మంజరి.

''ఐ లైక్ యూ మంజరీ.''

భయంగా, కోపంగా చూసింది మంజరి.

''ఐ లవ్ యూ మంజరీ''

అసహ్యంగా చూసి వేగంగా నడుస్తూ కిషన్‌ను దాటుకుని వెళ్లిపోయింది.

మంజరి చదువుతున్న కాలేజీలోనే డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు కిషన్. అల్లరి చిల్లరిగా తిరిగే విద్యార్థుల్లో కిషన్ ఒకడు.

మంజరి అందంగా, చురుగ్గా వుంటుంది. క్లాస్ అమ్మాయిలకు తనే నాయకురాలు. ఎప్పుడూ నవ్వుతూ, తుళ్లుతూ తన స్నేహితురాళ్లతో తిరిగే మంజరి చాలామంది అబ్బాయిలకు ఆరాధ్య దేవత. ఆమె దృష్టిలో పడేందుకు నానా తంటాలు పడుతుంటారు కుర్రాళ్లు. అవసరం మేరకే అబ్బాయిలతో మాట్లాడుతుంది మంజరి. బోయ్‌ఫ్రెండ్స్ ప్రేమ అంటూ తిరగడం మంజరికి ఇష్టం వుండదు. తన జీవిత లక్ష్యం కంప్యూటర్ రంగంలో డిగ్రీ, మంచి ఉద్యోగం సంపాదించడం.

కొన్నిరోజులుగా కిషన్ దారికాచి ఇలా వెంట పడుతున్నాడు. ఎంత తిట్టినా, బెదిరించినా మానడంలేదు. మొదట్లో అంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ ఇలా రోజూ వెంటపడుతుండడంతో మంజరికి మనశ్శాంతి లేకుండా పోయింది. ఇంట్లో కూడా చెప్పలేదు తల్లిదండ్రులు అనవసరంగా ఆందోళన చెందుతారని.

ప్రేమను నిరాకరించిన అమ్మాయిని కత్తితో పొడిచిన సంఘటన, యాసిడ్ పోసిన సంఘటనను దృష్టిలో వుంచుకుని మంజరి పోలీస్ కంప్లైంట్ కూడా ఇవ్వలేదు.

కిషన్ బెడదను ఎట్లా వదిలించుకోవాలనే విషయంపై రోజూ మంజరి తన స్నేహితురాళ్లతో చర్చిస్తూనే ఉంది.

'నువ్వంటే నాకిష్టంలేదు. పైగా అసహ్యం' అన్నా కూడా వెంటబడే అబ్బాయిలను ఏం చేసినా పాపం లేదనేది మంజరి స్నేహితురాళ్ల స్థిర అభిప్రాయం. ప్రేమంటే ఇరువైపుల నుండి వుండాలిగానీ నువ్వంటే నాకిష్టం అని బలవంతం చేయడం మూర్ఖత్వం కాకుంటే మరేమిటి? ప్రతిరోజూ మంజరికి నరకం చూపిస్తున్నాడు కిషన్.

గొడవ కాకుండా ఉపాయంగా కిషన్‌ను వదిలించుకోవాలనేది మంజరి ఆలోచన.

★★★

ఆ రోజు స్నేహితురాళ్లతో కాలేజీ లాన్స్‌లో కూర్చుని తన సమస్యను చర్చిస్తోంది మంజరి. ఒక్కొక్కరు ఒక్కో ఉపాయం చెప్తున్నారు. ఏదీ నచ్చడంలేదు మంజరికి.

''ఏమిటీ శిఖరాగ్ర సమావేశం జరుపుతున్నారు?'' అంటూ వచ్చింది నాగమల్లి.

కిషన్ క్లాస్‌మేట్ అయిన నాగమల్లి నల్లగా, ఎత్తు పళ్లతో వుంటుంది. తనకు అబ్బాయిలతో సరదాగా తిరగాలని వుంటుంది. ఆమె మాట్లాడేందుకు ప్రయత్నిస్తే ఏవో కుంటిసాకులు చెప్పి కుర్రాళ్లు పారిపోతుంటారు. మొదట్లో అలా తప్పించుకున్నందుకు బాధపడేది. తర్వాత దాన్ని సరదాగా తీసుకుని కుర్రాళ్లని ఆట పట్టిస్తుంటుంది. తనను ఏ మగాడూ ఏం చేయలేడని, తను ఎప్పుడైనా ఎక్కడికైనా నిర్భయంగా వెళతానని తనపై తనే జోక్ చేసుకుంటుంది.

''అదేనే ఆ కిషన్‌గాడి రోగం ఎలా కుదర్చాలా అని ఆలోచిస్తున్నాం'' ఒక్క మాటలో చెప్పింది పద్మజ.

''నీకేమైనా ఉపాయం తడితే చెప్పవే'' అంది మాలిని.

''ఏముందే కిషన్ బాగానే వుంటాడుగా. ఆస్తిపరుడు కూడా. ఒప్పేసుకోరాదూ?'' నవ్వుతూ మంజరిని ఉడికించింది.

అప్పుడే మంజరికి ఒక ఉపాయం తట్టింది. వెంటనే ఆ విషయం నాగమల్లికి చెప్పింది. అందుకు నాగమల్లి కూడా సంతోషంగా ఒప్పుకుంది.

మర్నాడు మంజరి వచ్చేదారిలో కాపువేసి ఉన్నాడు కిషన్. టైమ్ అయినా మంజరి రాకపోవడంతో అసహనంగా ఆ దారివైపే చూస్తున్నాడు. ఇంతలో ఆ దారి వెంటే నాగమల్లి రావడం చూశాడు కిషన్. పొద్దునే ఇది ఇట్నుంచి వస్తోందేమిటా అనుకుంటూ చూస్తే వదిలిపెట్టదని రోడ్డు పక్కనే వున్న పాన్‌డబ్బా వైపు వెళ్లి ఏదో కొంటున్నట్లుగా నిలబడి ఓరకంటగా గమనిస్తున్నాడు.

అయితే నాగమల్లి నేరుగా కిషన్ వద్దకు వెళ్లి ''హలో కిషన్! ఇక్కడున్నావేంటి?'' అని పలకరించడంతో గతుక్కుమన్నాడు.

''ఏం లేదు. ఇలా వెళుతున్నానంతే'' ఏడుపు గొంతుతో అన్నాడు.

''ఒకసారిలా వస్తావా కొంచెం మాట్లాడాలి'' అని పిలిచింది నాగమల్లి.

''ఏమిటి? ఎందుకు?'' అంటూనే ముందుకు వచ్చాడు.

''ఐ లైక్ యు కిషన్''

''...''

''ఐ లవ్ యూ కిషన్''

ఊహించని పరిణామానికి కిషన్ బిత్తరపోయాడు.

''నువ్వంటే పిచ్చి ఇష్టం కిషన్. పెళ్లంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంటాను. నువ్వు లేకుండా బ్రతకలేను'' అని చెప్పి కిషన్ సమాధానం కోసం చూడకుండా చకచకా వెళ్లిపోయింది.



కిషన్‌కు నోట మాట రాలేదు. మనసంతా చికాకుగా అయిపోయింది. మంజరి విషయం మరచి ఎటో వెళ్లిపోయాడు.

తర్వాత రోజు కల్సినప్పుడు నువ్వంటే తనకిష్టంలేదని అసహ్యం అని కూడా చెప్పాడు కిషన్. అయితే నాగమల్లి అందుకు ఒప్పుకోకపోగా తనను కాదని మరెవరినైనా ప్రేమించినా, పెళ్లి చేసుకున్నా సహించేదిలేదని, అలా జరిగితే యాసిడ్ పోస్తానని బెదిరించింది. పెళ్లంటూ చేసుకుంటే తననే చేసుకోవాలని హెచ్చరించింది. ఇప్పుడు కిషన్ ఆలోచనంతా నాగమల్లిని ఎలా తప్పించుకోవాలనే దాంతోనే సరిపోతోంది. కాలేజీకి కూడా సరిగ్గా రావడం లేదు.

ఏదేదో ఊహించుకుని భయపడిన మంజరి తాము ప్రయోగించిన చిన్న చిట్కాతో ఎంతో రిలీఫ్ వచ్చింది.

ఎంతో జటిలమైన సమస్య సునాయాసంగా పరిష్కారం అవడంతో మంజరి సంతోషానికి అంతులేదు.

నాగమల్లికి వందసార్లయినా కృతజ్ఞతలు తెలియజేసుకుంది.

★